క్లుప్తంగా

ఉమ్మడి ప్రభుత్వ విభాగాల అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

- అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జాకీర్ హుస్సేన్, శ్రీనివాసరావు



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీ రాజ్, మున్సిపల్ ఎంప్లాయిస్ ఉమ్మడి అసోసియేషన్ ఎన్నికలు స్థానిక ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. అసోసియేషన్ ఎన్నికలకు అధికారిగా రాష్ట్ర ఈసీ మెంబర్ బాబూరావు వ్యవహరించారు. జిల్లా కమిటీ అధ్యక్షునిగా ఎస్‌కే.జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కే.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.వెంకటేశ్వరరావు (వెంకట్), కోశాధికారిగా బి.వాలేశ్వరరావులతో పాటు పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కళాధర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు.

12న సామూహిక సత్యానారాయణ వ్రతం

కొత్తపట్నం: మండలంలోని కొత్తపట్నం గ్రామంలో వేంచేసియున్న ఆదికేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 12న సామూహిక సత్యానారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు కూరపాటి సుబ్బారావు తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులకు సూరాకనవల్లి అమ్మ ట్రస్ట్ యజమానులు, వైవీ కోటయ్య చారిటీస్, గ్రామస్తుల సహకారంలో ఉచిత భోజన వసతి, పూజా సామగ్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రతానికి మండలంలో ఉన్న భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కొండపి: గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. గురుకులంలో విద్యా అర్హత పొందేందుకు విద్యార్థులు ఆన్‌లైన్ మార్చి 6వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 6న నిర్వహించే రాత పరీక్షలో వచ్చిన ఫలితాల ఆధారంగా గురుకులంలో ప్రవేశించవచ్చని ప్రకటనలో కోరారు.

అన్నదాన సత్రానికి స్థల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో మహాప్రాకార నిర్మాణం, అన్నదాన సత్రం ఇతర నిర్మాణాలకు ఆదివారం దేవదాయ, ధర్మాదాయ డీఈఈ, స్థానిక ఈఓ, చైర్మన్‌లు స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా డీఈఈ సీహెచ్ శ్రీనివాస్ మహాప్రాకార మండపం, 167–బీ జాతీయ రహదారి నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో ఆర్చి నిర్మాణం, అన్నదాన భవనం, రేకులషెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వేసేందుకు కొలతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణలు మాట్లాడుతూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

గుండ్లకమ్మకు ఆక్రమణల చెర

- ఆక్రమణలతో కోతకు గురవుతున్న గుండ్లకమ్మ నది
- చిల్లచెట్లతో నీటి ప్రవాహానికి అడ్డంకి



ఆక్రమిత భూమిలో సాగు చేసిన పంటలు

నాగులుప్పలపాడు: గుండ్లకమ్మ నది వందల కిలో మీటర్ల మేర జిల్లాలో ప్రవహిస్తూ వేల మంది రైతులు, ప్రజలకు నీటి అవసరాలు తీరుస్తోంది. కాలక్రమంలో ఈ నది ఆక్రమణలకు గురై అస్తిత్వం కోల్పోతోంది. నాగులుప్పలపాడు మండల ప్రజలకు జీవధారగా ఉన్న గుండ్లకమ్మ నది మండలంలో 18 కి.మీ మేర ప్రవహిస్తోంది. దీనికింద 9 గ్రామాల ప్రజలకు తాగునీటి కోసం ప్రత్యక్షంగా మరో 12 గ్రామాలు పరోక్షంగా ఆధారపడుతుంటారు. అంతే కాక ఈ నదిపై ఆధారపడి 1500 ఎకరాల్లో మాగాణి, మరో 4 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతుంటాయి. అయితే ఈ నదిలో చిల్లచెట్లు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీనికి తోడు నదీ పరివాహక ప్రాంతంలో రానురాను ఆక్రమణల పర్వం ఎక్కువైంది. ఇప్పటికే మండలంలోని నిడమానూరు, చదలవాడ, చీర్వానుప్పలపాడు, అమ్మనబ్రోలు, మద్దిరాలపాడు గ్రామాల పరివాహకంలో సుమారు 30 ఎకరాలకు పైగా ఆక్రమణలు జరిగాయి. నది పరివాహకంలో ఆక్రమణలు ఎక్కువవడంతో పాటు చిల్లచెట్లు పెరగడం నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నది ఒడ్డు కోతకు గురవుతోంది. దీని వల్ల ఒడ్డున ఉన్న పొలాలు కూడా పాడైపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని అడ్డంకులు, ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పారుతున్న గుండ్లకమ్మ నది



వరద ధాటికి కోతకు గురైన గుండ్లకమ్మ పరివాహక ప్రాంతం



చిల్లచెట్లతో నిండిపోయిన గుండ్లకమ్మ నది

పుస్తక పఠనంతో విజ్ఞానం



జిల్లా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

ఒంగోలు సిటీ:

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. ఆదివారం ఒంగోలు జిల్లా గ్రంథాలయంలో పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తదుపరి పిల్లలతో నీతి కథలు, పంచతంత్ర కథలు, దేశ నాయకుల చరిత్రలకు సంబంధించిన కథలు చదివించారు. పిల్లలతో సొంతంగా కథలు చెప్పించారు. ఈ సందర్భంగా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ పుస్తకాలు కొనలేని వారు లైబ్రరీ సభ్యత్వం ద్వారా పుస్తకాలు అరువుగా తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎస్. అనిల్‌బాబు, పి.ఇమ్మానుయేలు, విద్యార్థులు పాల్గొన్నారు

సిల్వర్ జూబ్లీ సమ్మేళనం !



సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

- ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

సంతనూతలపాడు: వారంతా పాతికేళ్ల క్రితం కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు. ఆ తరువాత ఉన్నత విద్య, ఉద్యోగాలతో బిజీ అయిపోయారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంతనూతలపాడు మండల కేంద్రంలోని ఎస్ఎస్‌కేసీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000లో పదో తరగతి పూర్తి చేసుకున్న బ్యాచ్ పూర్వ విద్యార్థులు సరిగ్గా 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు.

కార్యక్రమానికి ఎక్కడెక్కడో ఉంటున్న దేశ, విదేశాల నుంచి పాత మిత్రులంతా తరలి వచ్చారు. ఒక్కరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులందరితో సరదాగా రోజంతా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి గురువులు పీవీ నరసింహారెడ్డి, పీవీ ప్రసాద్ రావు, టీ వెంకటేశ్వర్ రెడ్డి, జీ ఓబుల్ రెడ్డి, చావ నాగేశ్వరరావు, సీహెచ్ కొండయ్య, యూ పోలయ్య, బీ భాస్కర్‌రావులను సన్మానించుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమ సమన్వయకర్తలుగా ఇనగంటి సుబ్రహ్మణ్యం, షేక్ అమీన్ బాష, దుంపా నరేష్ రెడ్డి, బత్తుల చిరంజీవి, షేక్ ఖాజా మొహిద్దీన్, పాశం వెంకటరావు, షేక్ వలి, కుప్పా అంజని తదితరులు కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

రోడ్ సేఫ్టీ రూల్స్ తప్పక పాటించాలి

- ఒంగోల్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు



ప్రమాద హెచ్చరిక బోర్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మద్దిపాడు: వ్యతిరేక దిశలో ప్రయాణం చేయడం, వాహనాలను నడపటం ద్వారా ప్రమాదాలు కొనితెచ్చుకునే పరిస్థితి ఉంటుందని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాంపురం కొష్టాలు సెంటర్, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ వద్ద వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం వలన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో స్థానిక ఎస్సై బి.శివరామయ్య తమ సిబ్బందితో పాటు ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు ఆయా ప్రమాద కూడలిలను పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం వెల్లంపల్లి తాళ్లూరు రోడ్ లోని జేఎంఆర్ సినిమా హాలును పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వీరి వెంట స్థానిక ఎస్సై బీ శివరామయ్య స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రజల ఐక్యతకు ఆటలు దోహదం



సంక్రాంతి ఆటల పోటీల ముగింపు సందర్భంగా కొత్తపట్నంలో పిక్నిక్

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

కొత్తపట్నం: ప్రజలు ఐక్యతకు ఆటలు దోహదపడతాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న అన్నారు. ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎం కమిటీల ఆధ్వర్యంలో కొత్తపట్నంలో ఆదివారం పిక్నిక్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రామన్న మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యత సాధించేందుకు ఈ ఆటలు పోటీలు నిర్వహించామన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి జీవి.కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా, శ్రామికులకు భారంగా మారిందన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా సంఘాలు తమ సమస్యలపై పోరాటాలు చేస్తూనే మరోవైపు ప్రజలను చైతన్యపరిచేందుకు సేవ, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాగా గుర్తించారే తప్పా అభివృద్ధి చేసేందుకు తగిన చొరవ ప్రభుత్వం చేయడం లేదని దుయ్యబట్టారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ మాట్లాడుతూ ఐక్యత కోసం సంక్రాంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆటలు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆ పోటీల్లో పాల్గొన్న చురుకైన కార్యకర్తలకు ఈ పిక్నిక్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, ఐద్వా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె షమ్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆరోను, వీరస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, సాయి, ఐద్వా నాయకులు జి.ఆదిలక్ష్మి, కె.లక్ష్మీ ప్రసన్న, కె.శాంత కుమారి, కె.రాజేశ్వరి, బి.గోవిందమ్మ, జి.కల్యాణి, టి.లక్ష్మి, పీఎస్ఎం జిల్లా నాయకురాలు ఇంద్రజ్యోతి, డీవైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ప్రవీణ్ సాయికిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ




వివిధ రంగాలలో కృషి చేస్తున్న ప్రముఖులను సన్మానిస్తున్న కళా మిత్రమండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ కవి, హిందీ అధ్యాపకుడు, సాహిత్య రత్న పబ్బిశెట్టి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ స్థానిక మల్లయ్యలింగం భవనం ఆవరణలో ఆదివారం ఉదయం కళామిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు వృత్తిరీత్యా హిందీ లెక్చరర్ అయినా తెలుగులో వసుధ శతకం, పసిడి పలుకులు, వన గోపాలుడు, మానసబోధ, భక్తి గీతాలు, అమృతవాక్కులు వంటి పలు పుస్తకాలను రచించారన్నారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ దైవభక్తి, దేశభక్తి, మాతృభాషానురక్తి కలిగేలా రచనలు చేయడం ఆయన విశిష్టతని తెలిపారు. కార్యక్రమంలో సహజకవి శనగపల్లి సుబ్బారావు, బాల సాహితీవేత్త మద్దిరాల శ్రీనివాసులు, ఆళ్ళచెరువు సాంబశివరావులు, వి.యస్.సుబ్రమణ్యేశ్వర శర్మ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య కోశాధికారి డా.సంతవేలూరి కోటేశ్వరరావు, ప్రముఖకవి యు.వి.రత్నం, పోతుల పెద వీరనారాయణ, నూకతోటి శరత్ బాబు తదితరులు పబ్బిశెట్టి వెంకటేశ్వర్లుతో తమ అనుబంధాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకున్నారు. సభానంతరం నిర్వాహకులు, ఆయన సతీమణి పబ్బిశెట్టి సత్యవతి, మనవడు కార్తీక్ వారి కుటుంబ సభ్యులు వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖులైన రాయపాటి ఆశీర్వాదం, నిమ్మల వెంకయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, యం.వి.యస్.శాస్త్రి, మహతి తన్నీరు బాలాజీ, కప్పగంతు జయరామయ్య, ఆళ్ళ వెంకటేశ్వర్లు, నర్సింగోలు శ్రీనివాసప్రసాద్, చల్లా నాగేశ్వరమ్మ, ఆదూరి మనోహర, జంధ్యాల కామేశ్వరి, పరాంకుశం కృష్ణవేణి, జి.నాగేశ్వరరావు, మద్దిరాల సాంబశివరావు, షేక్ మగ్బుల్ అలీ, ఉప్పుటూరి మాధవరావు, బి.శ్రీనివాసరావు, ఉబ్బా అశోక్ బాబు, కోడూరి నాగేంద్ర, నారాయణం రఘు ప్రదీప్, షేక్ సందానీ, బీరం అరుణ, బండారు సునీత, యస్ నాంచారమ్మలను ఘనంగా సత్కారించారు.

వివాదాలకే కంకణం ఆరోపణలే ఆభరణం!

- ఒంగోలు నగరపాలక సంస్థలో వింత పోకడ
- పారిశుధ్య విభాగంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు మేస్త్రీలుగా డిమోషన్
- ఇటీవలే మేస్త్రీగా డిమోషన్ పొందిన 'కంకణాల'కు మళ్లీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు
- ఆది నుంచీ వివాదాస్పదుడిగా ముద్ర.. ఐదుసార్లు మెమోలు
- అధికార పార్టీ నేతల చేతులు తడిపి ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు ఆరోపణలు
- ఆయన తీరుతో బెంబేలెత్తుతున్న పారిశుధ్య కార్మికులు



PROCEEDINGS OF THE COMMISSIONER – ONGOLE MUNICIPAL CORPORATION

Commissioner,
Ongole Municipal Corporation

కంకణాలను ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ కమిషనర్ ఇచ్చిన ఆర్డర్ కాపీ

ఒంగోలు సబర్బన్: ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే ప్రజల్లో గుర్తింపు దక్కుతుంది! పదోన్నతి పొందేందుకు కూడా అవకాశం కలుగుతుంది. కానీ ఒంగోలు నగరపాలక సంస్థలో మాత్రం అందుకు భిన్నమైన వ్యవహారం నడుస్తోంది. అధికార పార్టీ నేతల ఆశీర్వాదం ఉంటే చాలు.. నగర పాలక సంస్థలో గిరాగిరా చక్రాలు తిప్పవచ్చని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అక్రమాలకు పాల్పడటమే కాకుండా, మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడినా ఉద్యోగానికి, పదోన్నతికి ఎలాంటి ఢోకా ఉండదని ఉన్నతాధికారులే ప్రమోషన్ ఉత్తర్వుల రూపంలో సెలవివ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఒంగోలు నగరంలోని పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కంకణాల ఆంజనేయులు తీరు మొదటి నుంచీ వివాదాస్పదమే. నలుగురు కమిషనర్లు మారినా ఆయన రూటే సపరేటు. ఆయన పని చేస్తున్న ఏరియాలో ప్రజలపైనా చిర్రుబుర్రులాడటం, కింది స్థాయి సిబ్బందిని వేధించడం తదితర ఆరోపణలపై నాలుగైదు పర్యాయాలు మెమోలు అందుకున్నారు. ఇటీవల ఆయన అక్రమాలపై విచారించిన కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నాలుగో పారిశుధ్య డివిజన్ ఇన్‌స్పెక్టర్ విధుల నుంచి తప్పించి గుత్తికొండవారిపాలెంలోని డంపింగ్ యార్డుకు మేస్త్రీగా బదిలీ చేశారు. అయితే తాజాగా కంకణాలను మూడో పారిశుధ్య డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో నగరంలో ఐదు పారిశుధ్య డివిజన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లకు మతిపోయినంత పనైంది. సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్లకు మేస్త్రీలుగా డిమోషన్ ఇచ్చి కంకణాలకు ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ ఇవ్వడం వెనుక ఎంత రాజకీయం జరిగిందో.. ఎంత మొత్తంలో ఆమ్యామ్యాలు చేతులు మారాయోనన్న ప్రచారం ఒంగోలు నగర పాలక సంస్థలో జోరందుకుంది. కంకణాల పోస్టింగ్ విషయంలో పాలక వర్గం పెద్ద తలలు అండగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు చేతులు మారాయన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

ఒంగోలు నగర పాలక సంస్థలో 5 పారిశుధ్య విభాగానికి చెందిన డివిజన్లుగా 50 డివిజన్లను విడగొట్టారు. ఒక్కో డివిజన్‌కు ఒక్కో ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. మొదటి నుంచి వివాదాస్పదుడిగా ముద్ర పడిన కంకణాల ఆంజనేయులును తిరిగి ఇన్‌స్పెక్టర్‌గా నియమించి ఐదో డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దుగ్గిరాల వెంకటేశ్వర్లుకు మేస్త్రీగా డిమోషన్ ఇచ్చారు. మూడో డివిజన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ యు.శ్రీరామ్‌కు కూడా మేస్త్రీగా డిమోషన్ ఇచ్చిన కమిషనర్.. కంకణాలకు మాత్రం డిమోషన్ నుంచి ప్రమోషన్ కల్పించి మూడో డివిజన్‌లో నియమించడం వెనుక మతలబు దాగి ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పారిశుధ్య సిబ్బంది అంతు చూస్తానంటూ కంకణాల బహిరంగంగానే బెదిరిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఆ ఇన్‌స్పెక్టర్ తమకు వద్దంటూ శానిటేషన్ ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కంకణాల సోమవారం నుంచి మూడో పారిశుధ్య డివిజన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు బెంబేలెత్తుతున్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో రాజరాజేశ్వరి అమ్మవారి పల్లకి సేవలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయరు పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఒంగోలు షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విరాట్ కు ఆలయ అర్చక స్వాములు పంచామృతాల అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ చేశారు. శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాల అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. సాయంత్రం ఏడు గంటలకు సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. పల్లకి సేవ నిర్వహించారు. ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ బ్రహ్మసుభూతి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం ఏడు గంటలకు మాస్టర్ వారి సమాధికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడికి మాతృవియోగం



బాల గురవమ్మ (ఫైల్)

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు నగరికంటి శ్రీనివాసరావు మాతృమూర్తి బాల గురవమ్మ ఆదివారం సాయంత్రం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.